క్లుప్తంగా

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవానికి తరలివచ్చిన భక్తులు

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల గ్రామంలో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి మోకిలతో పాటు చుట్టు పక్కన గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. కల్యాణోత్సం అనంతరం స్వామివారి త్రిశతి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటదాసార్యులు, యాదగిరి చలమాచార్యులు హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోకిల మాజీ సర్పంచ్ సుమిత్రమోహన్‌రెడ్డి, వక్తలు డా.అంజయ్య, చెన్నయ్య, లాల్‌రెడ్డి, తూర్పు మల్లారెడ్డి, గంటా మనోహర్‌రెడ్డి, ఆశీర్వాదం, కమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు

కమిషనర్ ఖాజా మొహియుద్దీన్



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిపాలన కార్యాలయాన్ని తాత్కాలికంగా అజీజ్‌నగర్ పాత గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి, ముర్తుజాగూడ గ్రామాల్లో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొయినాబాద్ పురపాలక సంఘం అజీజ్‌నగర్ కార్యాలయంలో గ్రామ నాయకులు, గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని తెలిపారు. మున్సిపాలిటీగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు పెద్దమంగళారం, చిలుకూరు, మొయినాబాద్, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, ముర్తుజాగూడ, సురంగల్ ఈ గ్రామాలకు సంబంధించిన మున్సిపాలిటీల పరిపాలన తాత్కాలికంగా అజీజ్‌నగర్ పురపాలక సంఘ కార్యాలయం నుంచి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంగలి రాములు, అద్వానీ, అల్లం సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

భూదాన్ రైతులకు న్యాయం చేయాలి

మాజీ ఎమ్మెల్యే నర్సింలు

నందిగామ: భూదాన్ బోర్డు ద్వారా భూములు పొందిన రైతులకు అధికారులు, పాలకులు న్యాయం చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో భూదాన్ భూములకు సంబంధించిన రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై భూదాన్ భూ బాధితులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1975లో భూదాన్ భూములు పొందిన రైతులకు నేటివరకు న్యాయం జరగడం లేదని, నిబంధనల మేరకు భూముల ప్రొసిడింగ్‌లు ఇచ్చారని పేర్కొన్నారు. కానీ నేటివరకు ఆ ప్రొసిడింగ్‌లు తహసీల్దారు కార్యాలయంలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. భూదాన్ భూ బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామన్నారు. అనంతరం భూ బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నందిగామ రెవెన్యూ గ్రామంలో 1975లో గ్రామ పంచాయితీ తీర్మానం మేరకు భూమిలేని నిరుపేద 18 మంది రైతులకు 990 సర్వే నెంబరులో 68 ఎకరాల 22 గుంటల భూమిని ప్రభుత్వం ప్రొసిడింగ్‌ల ద్వారా ఇచ్చిందన్నారు. ప్రొసిడింగ్‌లను నాటి నుంచి నేటివరకు రెవెన్యూ అధికారులు అమలు చేయలేకపోవడంతో సమస్య తలెత్తిందని ఆరోపించారు. ఇంతలో కొంత మంది నకిలీ ఓఆర్‌సీలను సృష్టించారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ధర్నాను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, శ్రీనివాస్, నర్సయ్య, యాదయ్య పాల్గొన్నారు.

అవి భూదాన్ భూములు కావు: మంజులారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, మేకగూడ

భూదాన్ భూములు అంటున్న వారు అవి భూదాన్ భూములు కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మాకు అట్టి భూమిపై ఓఆర్‌సీ ఉంది. గతంలో ఎల్ నారాయణరెడ్డి పేరుపై ఇనాం భూములు ఉండగా, మా కుటుంబ సభ్యులు పీటీ దారులుగా ఉన్నారు. 1956లోనే ఇనాం రద్దు అయ్యింది. అప్పటికే మేము పీటీ దారులుగా ఉండటంతో పీటీ యాక్ట్ ప్రకారం మా కుటుంబ సభ్యులకు ఓఆర్‌సీ ద్వారా అట్టి భూమి వచ్చింది. మెమెవరికీ అన్యాయం చేయడం లేదు లేదు.

ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- తుది జాబితా విడుదల చేసిన అధికారులు
- చేవెళ్ల మండలంలో 12 స్థానాలు

చేవెళ్ల: మండలంలోని ఎంపీటీసీ స్థానాల సవరణల అనంతరం తుది జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సూరింటెండెంట్ వీరేందర్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని సిద్ధం చేసిన తుది జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని పలు ఎంపీటీసీ స్థానల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 12 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసినట్లు చెప్పారు. మండలంలో గతంలో ఉన్న 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో 17 నుంచి 12 స్థానాలకు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. తంగడపల్లి ఎంపీటీసీ పరిధిలో తంగడపల్లి, అంతారం ఎంపీటీసీ పరిధిలో అంతారం, కౌకుంట్ల, హస్తేపూర్, న్యాలట ఎంపీటీసీ పరిధిలో న్యాలట, సింగప్పగూడ, తలారం, ఎన్కేపల్లి ఎంపీటీసీ పరిధిలో ఎన్కేపల్లి, ఈర్లపల్లి, కమ్మెట, గొల్లగూడ, ముడిమ్యాల ఎంపీటీసీ పరిధిలో ముడిమ్యాల, రావులపల్లి, కుమ్మెర, గొల్లపల్లి, ఆలూరు–1 ఎంపీటీసీ పరిధిలో ఆలూరు, ఆలూరు–2 ఎంపీటీసీ పరిధిలో ఆలూరు, చనువెళ్లి ఎంపీటీసీ పరిధిలో చనువెళ్లి, బస్తేపూర్, మిర్జాగూడ, ఖానాపూర్ ఎంపీటీసీ పరిధిలో ఖానాపూర్, నాంచేరి, రేగడిఘనాపూర్, దేవరంపల్లి, కందవాడ ఎంపీటీసీ పరిధిలో కందవాడ, పలుగుట్ట, మల్లారెడ్డిగూడ, అల్లవాడ ఎంపీటీసీ పరిధిలో అల్లవాడ, పామెన, గుండాల ఎంపీటీసీ పరిధిలో గుండాల గ్రామాలు ఉన్నట్లు తెలిపారు.

మొయినాబాద్‌లో 9..

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండలంలో 20 గ్రామాలతో కలిపి 9 ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటయ్యాయని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. సోమవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలకు సంబంధించిన పంచాయతీరాజ్ యాక్టు 2018 ప్రకారం మున్సిపాలిటీలో పోయిన గ్రామాలను వదిలిపెడితే 9 ఎంపీటీసీ స్థానాలు మండల పరిషత్‌లో ఉన్నాయని ప్రభుత్వం ద్వారా ముసాయిదా విడుదలైందని తెలిపారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో నోటీసును బోర్డుపై ప్రదర్శించారు. మండలంలో 17 ఎంపీటీసీలకు గాను 8 ఎంపీటీసీలు పోగా అందులో 9 ఎంపీటీసీ స్థానాలు మిగిలాయన్నారు. అమ్డాపూర్–కాశింబౌలి, కనకమామిడి–అప్పారెడ్డిగూడ, రెడ్డిపల్లి–చందానగర్–మోత్కుపల్లి–అప్పోజిగూడ, బాకారం–నాగిరెడ్డిగూడ, చిన్నమంగళారం, కేతిరెడ్డిపల్లి, మెడిపల్లి–కుత్‌బుద్దీన్‌గూడ–ఎల్కగూడ, తోల్‌కట్ట–ఎత్‌మార్‌పల్లి–నక్కలపల్లి, శ్రీరామ్‌నగర్–వెంకటాపూర్, 20 గ్రామాలతో కలిసి 9 ఎంపీటీసీ స్థానాల తుది జాబితా విడుదల చేశామని సంధ్య తెలిపారు. ముసాయిదా నోటీసు విడుదల చేసిన వారిలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, మండల సూపరింటెండెంట్ రెహమాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో తుది జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ



మొయినాబాద్‌రూరల్: ఎంపీటీసీల ముసాయిదా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సంధ్య, అధికారులు

కొత్తూరులో 6..

కొత్తూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కొత్తగా ప్రతిపాదించిన ఎంపీటీసీల స్థానాలు ఖరారు చేసినట్లు ఎంపీడీఓ అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత 6 స్థానాలను ఖరారు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. గతంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. కొత్తూరు మున్సిపాలిటీగా మారడంతో 4 స్థానా లు తగ్గాయి. ప్రస్తుతం గూడూరు ఎంపీటీసీ పరిధిలో గూడూరు, మక్తగూడ, మల్లాపూర్‌తండా గ్రామాలు, తీగాపూర్ ఎంపీటీసీ పరిధిలో తీగాపూర్, మల్లాపూర్, పెంజర్ల ఎంపీటీసీ పరిధిలో పెంజర్ల, కొడిచర్ల ఎంపీటీసీ పరిధిలో కొడిచర్ల, కొడిచర్లతండా, ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ పరిధిలో ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ ఎంపీటీసీ పరిధిలో సిద్ధాపూర్, వైఎంతండా గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాలు, పట్టణంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పైప్‌లైన్లు, వాల్స్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. బైరంపల్లి గ్రిడ్ పరిధిలో నీటి సరఫరా పంపులు తరచూ పాడవుతుండటంతో చాలా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వడ్డెవాడ గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎందుకు వేయలేదని, 22 కుటుంబాలు నివాసం ఉంటున్న చిన్న గ్రామానికి పైప్‌లైన్ వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. మంచినీటి సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ నాగేశ్వర్, డీఈఈలు సందీప్, అబ్దుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాజు, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అభివృద్ధిలో కేంద్ర నిధులే కీలకం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధిలో కేంద్రం అందించే నిధులే కీలకంగా ఉన్నాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సోమవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో వచ్చిన ఎంపీ లాడ్స్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే ఇప్పుడు రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఖజానా లేక ఇచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలు ఈ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదన్నారు. పీఎం మోదీ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే దేశ వ్యాప్తంగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి గ్రామాల అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయించారని, ఈ నిధులతో గ్రామాల్లో జోరుగా పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, సామ మానిక్యరెడ్డి, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, దేవుని శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, కృష్ణగౌడ్, ఎ.శ్రీనివాస్, మల్లేశ్, జైపాల్‌గౌడ్, శివ, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, గ్రామ నాయకులు యాదిరెడ్డి, మాధవ్‌రెడ్డి, మానిక్యరెడ్డి, ఝాఫర్, నరేందర్‌గౌడ్, మోసిన్, ఉమ్మర్ తదితరులు ఉన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

కొందుర్గు: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓలు లక్ష్మీఅనురాధ, ప్రవీన్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు.

'లక్ష డప్పుల'ను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 7 నిర్వహించే లక్ష డప్పులు–వేల గొంతులు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు అయితే భావితరాలకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు అన్ని ప్రభుత్వాలు మాదిగలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా ఎల్బీ స్టేడియంలో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జెనిగ జగన్, తుప్పుడు నర్సయ్య, చిన్నోళ్ల అనంతయ్య, ఇప్పలపల్లి దర్శన్, ఎర్రోళ్ల జగన్, రవికుమార్, అశోక్, మీరాపురం వెంకటయ్య, జంగయ్య, శివకుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



నవీన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో గల నల్లచెరువు కట్ట మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. అతి పురాతనమైన ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు అందించిన దాత నేరట్ల పరిపూర్ణ మహేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసుకొని, దూప, దీప నైవేద్యాలను కొనసాగిండం మంచి పరిణామన్నారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, కొంత సమయం దేవునికి కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాంరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వెంకటయ్య, సత్యనారాయణరెడ్డి, విక్రంరెడ్డి, నర్సింలు, పాండు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లింగం, ఖాజామీయా, నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రామాల పురోగతే లక్ష్యం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్



మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల్లోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు సుమారు 7కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఈ నిధులను మంజూరు చేయించారని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని ఆయన తెలపారు. రానున్న నాలుగేళ్లలోగా గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతాయని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగిళ్ల భాస్కర్, సురేశ్‌రెడ్డి, బీస కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, రావుల పెంటయ్య, గ్యార సురేష్, తుమ్మల గోపాల్, కోడూరు రాములు, భీమయ్య, రూప్లా నాయక్, హరీశ్వర్‌రెడ్డి, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ ట్రాక్టర్

- అవగాహన లోపంతో నీరుగారుతున్న సర్కారు లక్ష్యం
- అప్పుల ఊబిలో మండల మహిళా సమాఖ్య



కొందుర్గు మండల సమాఖ్య ఎదుట వృథాగా ఉన్న ట్రాక్టర్

కొందుర్గు: ప్రభుత్వం మంచి లక్ష్యంతో తలపెట్టిన పథకం అవగాహన లోపంతో నీరుగారుతోంది. ముందుచూపు లేకపోవడంతో పొదుపు చేసిన డబ్బులు కాస్తా అప్పు తీర్చడానికి సరిపోతున్నాయని కొందుర్గు మండల మహిళా సమాఖ్య సభ్యులు వాపోతున్నారు. వ్యవసాయాధారిత మండలమైన కొందుర్గు మండల మహిళా సమాఖ్యకు ట్రాక్టర్ ఇవ్వడంతో అటు రైతులకు ఉపయోగపడటంతో పాటు, ఇటు మండల సమాఖ్యకు ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో 2022 ఏప్రిల్‌లో రూ. 9,12,296 ఖర్చుచేసి ట్రాక్టర్ మంజూరు చేసింది. అలాగే ట్రాక్టర్‌కు సంబంధించిన రూటోవేటర్, కల్టివేటర్, కరిగెట్ చేసే వీల్స్ అందించారు. అదేవిధంగా మరో రూ.2లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీని అప్పటి కలెక్టర్ సమాఖ్యకు ఉచితంగా అందజేశారు. మొత్తం ట్రాక్టర్ యూనిట్‌కు సంబంధించి రూ. 8,97,300లు స్త్రీనిధి రుణం అందించగా, రూ. 3,45000లు రాయితీ ఉంటుంది. దీనికి గాను రూ.1,38,225లు మండల మహిళా సమాఖ్య వాటా ఖర్చు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ట్రాక్టర్‌కు డ్రైవర్‌ను కూడా నియమించకపోవడం, కొందుర్గు మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ట్రాక్టర్లు అధికంగా ఉండటంతో సర్కారు లక్ష్యం నీరుగారుతోంది.

వినియోగంలో లేకపోవడంతో..

రైతులెవరూ ట్రాక్టర్‌ను వినియోగించుకోకపోవడంతో ప్రస్తుతం ట్రాక్టర్ మహిళా సమాఖ్య భవనం ఎదుట వృథాగా పడి ఉంది. ట్రాక్టర్ పనిచేయడం లేదు. ట్రాక్టర్‌కు సంబంధించిన వాయిదాలు కట్టడానికి ఇబ్బందిగా మారిందని సమాఖ్య సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాఖ్యలో తాము పొదుపు చేసిన డబ్బులు వాయిదాల కోసం కట్ చేసుకుంటున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విస్తృతంగా ప్రచారం చేశాం



మండల సమాఖ్యలో ట్రాక్టర్ ఉందని, నెలకు రూ.22వేలు ఇచ్చి తీసుకెళ్లాలని రైతులకు విస్తృతంగా ప్రచారం చేశాం. అయినా రైతులు ట్రాక్టర్ తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ట్రాక్టర్‌ను వృథాగా పెట్టి వాయిదాలు చెల్లించాల్సి వస్తోంది.

–జయమాలిని, ఏపీఎం, కొందుర్గు

అధికంగా ఉండడంతోనే..



గ్రామాల్లో ట్రాక్టర్లు అధికంగా ఉండటంతోనే రైతులు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం పంటలపై మందులు పిచికారీ చేసే డ్రోన్ యంత్రంపై చాలా డిమాండ్ ఉంది. మండలంలో ఎక్కడ ఈ యంత్రం లేదు. అది ఇచ్చినా బాగుండేది.

–సంగీత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ఘనంగా వసంత పంచమి



చేవెళ్లలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితులు

వసంత పంచమిని పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతి మాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులు వారితో అక్షరాలు దిద్దించి ఆశీర్వదించారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితులు రవిశర్మ



మొయినాబాద్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



కొందుర్గు: ముట్పూర్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బంట్వారం: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

బంట్వారం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశంతో కలిసి తొర్మామిడిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్వాద్‌లో..

కోట్‌పల్లి మండలంలోని బార్వాద్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.